నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 11 మార్చి 2024 | KHAMMAM

# నేడు భద్రాద్రికి సీఎం రేవంత్‌రెడ్డి

- మార్కెట్ కమిటీ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి పథకానికి శ్రీకారం
- ఇరిగేషన్, రామాలయ అధికారులతో సమీక్ష
- అనంతరం మణుగూరు బహిరంగ సభకు హాజరు



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలి సారిగా భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు సారపాకలోని హెలిప్యాడ్‌లో లాండ్ కానున్నారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా భద్రాచలం పట్టణానికి చేరుకోనున్నారు. అనంతరం పట్టణంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకోనున్నారు. 12.50 గంటలకు మార్కెట్ రోడ్‌కు చేరుకుని మార్కెట్ కమిటీ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. 2 గంటలకు ఇరిగేషన్, రామాలయ అధికారులను సమీక్షించనున్నారు. అనంతరం మణుగూరు పట్టణానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కలెక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. అధికారుల సమీక్షలకు రంగం సిద్ధం చేశారు.

## సీఎం ముందు అనేక డిమాండ్లు..

పోలవరం ప్రాజెక్ట్ ముంపు సాకుతో కేంద్రం ఐదు పంచాయతీలతోపాటు కొన్ని మండలాలను నాడు ఆంధ్రాలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ పంచాయతీలను తెలంగాణలో కలపాలని అనేక పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల అనేక రాజకీయ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయా డిమాండ్లను మీడియా ముందు ఉంచాయి. ఏటా వానకాలంలో భద్రాచలం పట్టణ వాసులు వరద ముప్పు ఎదుర్కోవాల్సి వస్తుందని, కరకట్టను ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరకట్ట ఎత్తు పెంచడంతోపాటు నిర్మాణాన్ని పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## మణుగూరులో..

మణుగూరుటౌన్, మార్చి 10: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మణుగూరులో నిర్వహించే ప్రజాదీవెన సభకు రానున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సభ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న సభా వేదికను, పార్కింగ్ స్థలాలు, హెలీప్యాడ్‌లను పరిశీలించారు. ఆయన తోపాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉన్నారు. మరోవైపు కళాశాల ప్రాంగణం మొత్తాన్ని భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకుంది. సభావేదిక, హెలీప్యాడ్లు, పార్కింగ్ స్థలాలను బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. ముఖ్యమంత్రి సభకు చేరుకునే విధానాన్ని కాన్వాయ్‌తో ట్రయల్ రన్ చేసి పరిశీలించారు.

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలం, మార్చి 10 భద్రాచలంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మంత్రి వెంట ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, కలెక్టర్ ప్రియాంక ఆల ఉన్నారు. మంత్రి అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనీల్‌కుమార్, ఆలయ ఈవో ఎల్ రమాదేవి నవమి ఏర్పాట్లపై సమీక్షించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

# అర్బన్ పార్క్ అద్భుతం



అర్బన్ పార్కులో సివిల్ జడ్జీలు

ఇల్లెందు రూరల్, మార్చి 10: సుభాష్‌నగర్ ప్రాంతం కోరగుట్ట అర్బన్ పార్క్ అద్భుతంగా ఉందని భద్రాచలం జూనియర్ సివిల్ జడ్జి సూరిరెడ్డి, కొత్తగూడెం జూనియర్ సివిల్ జడ్జి శివనాయక్, కరీంనగర్ జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రాజేశ్వర్, దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి హరీశ్ అన్నారు. ఆదివారం వారు ఇల్లెందు ఫారెస్ట్ అధికారులతో కలిసి పార్క్‌ను సందర్శించి మాట్లాడారు. పార్క్‌లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆటబొమ్మలు ఉన్నాయని, పెద్దల వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్ అందుబాటులో ఉందన్నారు. వారి వెంట డీఎఫ్‌వో కె.వెంకన్న, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

# పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- ఈ నెల 18 నుంచి ఎగ్జామ్స్ షురూ..
- జిల్లావ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలు
- 1,133 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- విద్యార్థులకు సివిల్ డ్రెస్ కోడ్ అనుమతి
- యూనిఫాంతో వస్తే కేంద్రాల్లోకి నో ఎంట్రీ



ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 10: పది పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జిల్లావ్యాప్తంగా 97 సెంటర్లలో విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే ఇన్విజిలేటర్ల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. సోమవారం ఈ మేరకు ఇన్విజిలేటర్లు ఉత్తర్వులు అందుకోనున్నారు. ఇన్విజిలేషన్‌కు విద్యాశాఖ ప్రధానోపాధ్యాయులు మినహా 1,133 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించింది. వీరు రెండు స్పెల్స్‌లో విధులు నిర్వర్తించనున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల పరీక్షలు జరుగుతున్న సమయంలో గణితం, భౌతిక, రసాయనశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తారు. గణితం, భౌతిక, రసాయనశాస్త్ర పరీక్షలు జరిగే సమయంలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లు బోధించే ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తారు.

## ఇన్విజిలేటర్ల విధులు ఇవీ..

సీఎస్, డీవోలు జారీ చేసిన సూచనలు, ఆదేశాలను ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పరీక్ష రోజు వీరు 45 నిమిషాలు ముందుగానే పరీక్షా హాల్‌కు వెళ్లాలి. విద్యార్థులకు సమాధాన పత్రాలు, ఓఎంఆర్ షీట్స్ అందించాలి. ప్రశ్నాపత్రాల ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. రాంగ్ కాంబినేషన్‌లో ప్రశ్నాపత్రాలు అందిస్తే ఇన్విజిలేటరే బాధ్యుడవుతాడు. వారిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయి. విద్యార్థులు అదనపు సమాధాన పత్రం తీసుకుంటే ఆ షీటు సీరియల్ నంబర్‌ను ప్రొ ఫార్మా-3లో నమోదు చేయాలి. విద్యార్థుల సంతకాల తీసుకోవాలి. ఇన్విజిలేటర్ సంబంధీకులెవరూ పరీక్షా సెంటర్‌లో లేరని ముందుగా నిర్వాహకులకు ధ్రువపత్రం అందించాల్సి ఉంటుంది. పరీక్షా హాల్‌లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదు. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థుల నుంచి మీడియాల వారీగా సమాధాన పత్రాలు తీసుకోవాలి. పరీక్ష ముగిసిన తర్వాతే విద్యార్థులను పరీక్షల హాల్ నుంచి బయటకు పంపించాలి. పరీక్ష విధుల నిర్వహణకు నియమించిన వారు హాజరుకాకపోతే సీసీఏ రూల్స్, యాక్ట్ 25/97 ప్రకారం వారిపై చర్యలు ఉంటాయి.

## సివిల్ డ్రెస్‌కే అనుమతి..

పరీక్షలకు 282 ప్రభుత్వ స్కూల్స్ నుంచి 10,146 మంది, 141 ప్రైవేట్ స్కూల్స్ నుంచి 6,368 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సాధారణంగా ఒక్కో స్కూలుకు ఒక్కో యూనిఫాం కోడ్ ఉంటుంది. ఫలానా యూనిఫాం ఫలానా స్కూల్‌కు చెందినది అని సులభంగా పరీక్షల నిర్వాహకులకు తెలిసిపోతుంది కాబట్టి విద్యాశాఖ సివిల్ డ్రెస్ కోడ్ అమలు చేస్తున్నది. యూనిఫాంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని తేల్చిచెప్పింది.

## బధిరులు, అంధులకు సహాయకులు..

పీహెచ్ క్యాటగిరీ -1, క్యాటగిరీ-2 నిబంధనల మేరకు జిల్లావ్యాప్తంగా 42 బధిరులు, అంధ విద్యార్థులు సహాయకులతో పరీక్ష రాయించుకోనున్నారు. వీరికి సహాయకులను నియమించేందుకు ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి డీఈవో కార్యాలయానికి ఆదేశాలు అందాయి. సదరు విద్యార్థులకు సహాయకులుగా తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అందుకు తొమ్మిదో తరగతి విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్స్‌ను పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు అందించాల్సి ఉంటుంది.

## జిల్లా అబ్జర్వర్‌గా శ్రీనివాసాచారి..

పది పరీక్షల ఉమ్మడి జిల్లా అబ్జర్వర్‌గా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి నియమితులయ్యారు. ఆయన పరీక్షకు రెండు రోజుల ముందు జిల్లాకు చేరుకుని పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారి, పరీక్షల విభాగ అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ శివరాత్రి, 9న రెండో శనివారం, 10వ తేదీ ఆదివారం సెలవులనైప్పటికీ డీఈవో సోమశేఖరశర్మ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ధనాతో కలిసి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర పరీక్షల విభాగం స్పెల్స్ వారీగా ఇప్పటికే జిల్లాలకు ప్రశ్నాపత్రాలను చేర్చింది. ఆ ప్రశ్నాపత్రాలు ఇప్పటికే పోలీస్ స్టేషన్లలో భద్రంగా ఉన్నాయి.

# మెళకువలతోనే మామిడి దిగుబడులు

**ఈ సారి మామిడి పంటకు అనుకూలమే..**

- మార్చిలో తగిన జాగ్రత్తలు పాటించడమే కీలకం
- మామిడి రైతులకు పలు సూచనలు చేసిన రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత



వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 10 : ఆరుగాలం కష్టపడి రైతు పండించే పంటలు చేతికందేలోపే చీడపీడల బారిన పడితే? ఆ రైతుకు తీరని నష్టం జరుగుతుంది. ఒక్క రైతుకే కాదు, ఆ కుటుంబానికీ తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రైతు బాగుంటేనే రా జ్యం బాగుంటది అనే నానుడిని నిజం చేయాలంటే మొదట రైతును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు తమవంతుగా మామిడి రైతుల కోసం పలు సూచనలు, సలహాలు పాటిస్తే ఈ సీజన్‌లో అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. ఆ విషయాలేంటో తెలుసుకుందాం.

ఈ ఏడాది మామిడికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నా, మార్చి నెలలో తగిన జాగ్రత్తలు పాటిస్తేనే అధిగ దిగుబడి పొందవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత సూచిస్తున్నారు. ఉద్యాన శాస్త్రవేత్తల, అధికారుల సూచనలు ఎంతో కీలకమని చెప్పారు. మామిడి ప్రస్తుతం పిందె, కాత దశలో ఉందని తెలిపారు. అయితే పిందె, కాయలపై తేనెమంచు, కాండం తొలుచు, కాయతొలుచు పురుగులు, మసిమంగు, పిండి నల్లి, బూడిద తెగుళ్లు అధికంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే తగిన జాగ్రత్తలు పాటించకపోతే అపార నష్టం వాటిల్లుతుందన్నారు. కాయ పెరుగుదల దశలో వీలైనంత వరకు డ్రిప్ ద్వారా చెట్టుకు నీరందించాలని సూచించారు. కాయలకు కవర్ తొడుగు ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఎదుగుతుందని వివరించారు.

## తేనె మంచు పురుగు...

ఈ పురుగు ఆకు, పువ్వు, పిందెలపై చేరి రసాన్ని పీలుస్తాయి. పూత, పిందె వాడిపోయి రాలిపోతుంది. పురుగు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసి గల శిలీంధ్రాలు పెరుగుతాయి. దీంతో నల్లని మసిమంగు ఏర్పడుతుంది. ఈ పురుగు కాయ లేని కాలంలో కొమ్మల బెరడులో దాగి ఉంటుంది. అనంతరం లేత ఆకులపై, పూరెమ్మలపై ఉంటుంది. వాతావరణ పరిస్థితుల్లో హెచ్చు తగ్గులు, అంటే చలిగా ఉన్నప్పుడు ఎక్కువ ఉధృతి పెరుగుతుంది. తేనెలాంటి బంక ఆకులపై చేరడంతో సూర్యరశ్మి వెలుగులో మెరుస్తుంది. తేనెమంచు నివారణకు లీటర్ నీటిలో డైమిథోయేట్ 2 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ తగిన మోతాదులో నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

## తెలంగాణ నుంచే అధిక దిగుబడి...

ఈ సారి రాష్ట్రం నుంచి మామిడి అధిక దిగుబడి రానుందన్నారు. మెళకువలతో మామిడిని రక్షిస్తే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. మామిడిని దేశంలోనే అధికంగా సాగుచేసేది తెలంగాణేనని, అందుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలమని వెల్లడించారు. ప్రస్తుతం తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## మసిమంగు...

ఆకులు, పూత, పిందెలు, కాయలమీద రసం పీల్చే తేనెమంచు పురుగు, పిండినల్లి, తామర పురుగులు, చీడపీడలు ఆశించినప్పుడు (సోకినప్పుడు).. అవి విసర్జించిన తేనె లాంటి పదార్థంపై శిలీంధ్రాలు క్యాప్నోడియం పరాన్న భుక్కులుగా పెరిగి నల్లని మసి తెగులు వస్తుంది. కొంతకాలం తర్వాత ఇది మసిమంగుగా మారుతుంది. తెగుళ్లు సోకిన కాయలపై నల్లని మచ్చలుగా ఏర్పడి అవి అమ్మకానికి డిమాండ్ లేకుండాపోతాయి. దీని ప్రభావం మార్చి నెలలో ఎక్కువగా ఉంటుంది. కనుక జాగ్రత్త అవసరం. జిగురు లేని కాయలపై మసి తెగులు సోకదు. ఆకు మసి తెగులు కనిపిస్తే.. 2 శాతం గంజి ద్రావణం పిచికారీ చేయాలి.

## బూడిద తెగులు...

ఈ తెగులు ఆకు మీద, పూరెమ్మలపైన, బూడిద వంటి తెల్లని పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. ఇది పూత కాలంలో కనబడుతుంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3గ్రాములు, లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారీ చేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగహర్షిత సూచించారు.

## కాండం తొలిచే పురుగు..

కాండం తొలిచే పురుగు సోకినప్పుడు చెట్టు ఎండిపోతుంది. గట్టి ఇనుప తీగ సహాయంతో పురుగును తొలగించాలి. పురుగు విసర్జన, పురుగు కొమ్మను తట్టినప్పుడు వచ్చే శబ్దాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

## కాయతొలుచు పురుగు..

ఎండు పుల్లలో నిద్రావస్థ దశలో రెక్కల పురుగు వెలువడి కాయల మీద గుడ్డు పెడుతుంది. ఈ పురుగు మామిడి పండ్ల దశలో మూడు తరాలు వృద్ధి చెందుతుంది. అనంతరం పంటను ఆశిస్తాయి. పురుగు ఆశించిన చెట్టును తొలగించాలి.

## పిండినల్లి..

భూమిలో పొదగబడిన గుడ్డు, పిల్ల పురుగులు చెట్లపైకి పాకుతాయి. చీమల ద్వారా పైకి పాకి గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది. దీనివల్ల కాయలు సరిగ్గా ఎదగకుండా రాలిపోతాయి. నివారణకు.. మిథైల్ పెరాథియాన్‌ను పిచికారీ చేయాలి. టెంక పురుగు కాయలోపలికి చొచ్చుకొని పోయి లోపల గోకి తింటుంది. ఇది ఆలస్యంగా కోత దశలో కనిపిస్తోంది. నివారణకు మి.లీ ఫినిట్రోథియాను లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

# మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్రప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చింతకాని, మార్చి 10: మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అనంతరం చింతకాని మండలం ప్రొద్దుటూరు రైతు వేదికలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందిస్తామన్నారు. వడ్డీ లేని రుణాల పంపిణీని ఈ నెల 12న ప్రారంభిస్తామన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చేయూతనిస్తామన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు నిర్మిస్తామని, ఒక్కో ఇంటి యజమానికి రూ.5 లక్షల సాయం అందిస్తామన్నారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు దుర్గాప్రసాద్, కిలారు మనోహర్‌బాబు, కొప్పుల గోవిందరావు, కిశోర్, వెంకటేశ్వర్లు, జావిద్ పాల్గొన్నారు.




లచ్చగూడెంలో మోడల్‌స్కూల్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

## బోనకల్లు, ముదిగొండ, చింతకాని మండలాల్లో..

బోనకల్లు, మార్చి 10: బోనకల్లు మండలంలోని లక్ష్మీపురం, కలకోట, ఆళ్లపాడు గ్రామంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటించారు. లక్ష్మీపురం- పాతర్లపాడు వరకు రూ.27 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, ఆళ్లపాడు -గోవిందాపురం వరకు రూ.28, కోట్లతో నిర్మించనున్న రోడ్డు, కలకోట -నారాయణపురం వరకు రూ.85 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, జడ్పీటీసీ మోదుగుల సుధీర్‌బాబు ఉన్నారు. ముదిగొండ మండలంలోని వనంవారి కిష్టాపురంలో బీటీ రోడ్డు, వనంవారి కిష్టాపురం- జగన్నాథపురం ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. చింతకాని మండలంలో ప్రొద్దుటూరు-పాతర్లపాడు, లచ్చగూడెం- రాఘవాపురం, రాఘవాపురం- అల్లీపురం, రాఘవాపురం-స్టేడియం రోడ్‌కు శంకుస్థాపన చేశారు. లచ్చగూడెంలో డబుల్ బెడ్ రూం నిర్మాణాలను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ సీఎం వెంట కలెక్టర్ వీపీ గౌతమ్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో రామయ్య పాల్గొన్నారు.

# గోదారి సంధ్యా రాగం!



పొద్దంతా అగ్నిగోళ మై సూరీడు భగభగమన్నాడు.. సాయంత్రానికి శాంతించాడు.. పడమటి తీరాన సేద తీరుతూ నదిపై తన ప్రతిబింబాన్ని చూసుకుని మురిసిపోతున్నాడు.. అందుకు పరవశించి గోదారి 'సంధ్యా'రాగం పాడుతున్నట్లు ఆహ్లాదంగా ఉంది కదా ఈ చిత్రం. ఆదివారం సాయంత్రం 'నమస్తే' పర్ణశాలలో చిత్రాన్ని బంధించింది.

- పర్ణశాల, మార్చి 10